ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

జయశంకర్ భూపాలపల్లి

ములుగు

5

ఆదివారం 28 జూలై 2024



ఆంధ్రజ్యోతి Sunday SPECIAL

టీచర్లూ.. సెల్యూట్


తన ఇద్దరు పిల్లలతో ఇనుగుర్తి ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు ఎం.వెంకటేశ్వరాచారి

- తాము పనిచేసే సర్కారు బడిలోనే తమ పిల్లలకు చదువులు
- ప్రైవేటు స్కూళ్లు వద్దు.. ప్రభుత్వ బడులే ముద్దంటున్న పలువురు గురువులు
- ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఆదర్శంగా నిలుస్తున్న ఉపాధ్యాయులు
- గవర్నమెంట్ బడుల్లోనే మెరుగైన బోధన, సౌకర్యాలున్నాయంటూ కితాబు


7



ఇప్పుడంతా 'కార్పొరేట్' యుగం. చదువుల నుంచి కొలువుల వరకూ అందరూ కార్పొరేట్ సంస్థలవైపే మొగ్గుచూపుతున్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రభుత్వ విద్యావ్యవస్థపై తల్లిదండ్రులు కూడా అంతగా ఆసక్తి చూపడం లేదు. పేద, మధ్యతరగతి కుటుంబాల వారు సైతం కష్టాలు పడైనా.. అప్పులు చేసైనా.. తమ పిల్లలను ప్రముఖ నగరాలు, పట్టణాల్లోని కార్పొరేట్ విద్యాసంస్థల్లో చదివిస్తుంటే.. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని పలువురు ప్రభుత్వ ఉపాధ్యాయులు మాత్రం.. తమ పిల్లలకు తాము పనిచేసే ప్రభుత్వ బడుల్లోనే చదువు చెప్పిస్తున్నారు. పెద్దపెద్ద కార్పొరేట్ విద్యాసంస్థల్లో చదువు చెప్పించే స్థోమత ఉన్నా.. సర్కారు స్కూళ్లలోనూ మెరుగైన సౌకర్యాలు ఉన్నాయని, నాణ్యమైన విద్యాబోధన అందుతోందని, ప్రైవేట్, కార్పొరేట్ తరహాలోనే నిష్ణాతులైన ఉపాధ్యాయులున్నారని, ఇంగ్లీష్ మీడియం బోధన కూడా మెరుగ్గానే ఉంటోందని కితాబిస్తున్నారు. ప్రభుత్వ బడుల్లో కొలువులు చేసి.. ప్రజాధనాన్ని వేతనంగా తీసుకోవడమే కాదు.. అన్ని వర్గాల ప్రజలకు ప్రభుత్వ విద్యపై నమ్మకం కలిగించేలా తమ పిల్లలకు సర్కారు చదువు చెప్పిస్తూ ఎందరికో ఆదర్శంగా నిలుస్తున్నారు.

- ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్

రైతన్నలు ప్రసన్నం


ఏపుగా ఎదిగిన సన్నరకం వరి నారు

- ఆధునిక బాటలో అన్నదాతలు
- సన్న రకాల వరి సాగుపై ఆసక్తి
- సర్కారు ప్రోత్సహించడంతో మందుకు..
- భూపాలపల్లి జిల్లాలో పెరిగిన విస్తీర్ణం
- దొడ్డు రకాలపై విముఖత

కాటారం, జూలై 27: రైతన్నల ఆలోచనల్లో మార్పు వస్తోంది. వ్యవసాయం ఇప్పుడు కొత్త పుంతలు తొక్కుతోంది. సాగులో అన్నదాతలు వినూత్న పద్ధతులను అవలంబిస్తున్నారు. ఇందులో భాగంగా దొడ్డు రకం వరికి స్వస్తి పలికారు.. సన్నరకాలకు ప్రాధాన్యం ఇస్తున్నారు. భూపాలపల్లి జిల్లా వ్యాప్తంగా సుమారు 92 లక్షల ఎకరాల్లో ఈ రకాల వరిని సాగు చేస్తున్నారు.

ప్రస్తుత వానాకాలంలో జిల్లాలో సుమారు 1.12 లక్షల ఎకరాల విస్తీర్ణంలో వరి సాగు కానుంది. ఇందులో అత్యధికంగా సన్న రకాలే ఉన్నాయి. గతానికి భిన్నంగా రైతులు వరి సాగులో దొడ్డు రకాలపై విముఖత చూపుతున్నారు. వ్యయప్రయాసకోర్చయినా సన్న రకాలకే మొగ్గు చూపుతున్నారు. కొత్తగా కొలువు దీరిన సర్కారు ఇస్తున్న ప్రోత్సాహకమే ఇందుకు ప్రధాన కారణమని తెలుస్తోంది. రైతు భరోసాలో భాగంగా సన్న రకం వడ్లకు క్వింటాల్‌కు రూ.500 బోనస్ ఇవ్వనున్నట్లు రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ప్రకటించింది. ఈ సీజన్ వరి ధాన్యం కొనుగోళ్ల నుంచే బోనస్ వర్తించనుండటం సన్నరకాల సాగు విస్తీర్ణం పెరగడానికి ప్రధాన కారణమని తెలుస్తోంది. రెండు, మూడేళ్లుగా దొడ్డు రకాలైన ఎంటీయూ-1001, 1075, 1061, 1153, కేఎన్‌ఎం-118 వంటి వడ్లను కొనుగోలు చేయడంలో మిల్లర్లు విముఖత ప్రదర్శించడం మరో కారణమనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

ప్రభుత్వ ప్రోత్సహించడం వల్లే..

జిల్లాలో 40 వెరైటీలకు పైగా సన్నరకాలు సాగవుతున్నాయి. ప్రధానంగా ఎంటీయూ-1224, 1271, 1282, జేజీఎల్-1798, హెచ్‌ఎంటీ సోనా, కేఎన్‌ఎం-1638, బీపీటీ-5204, ఆర్‌ఎన్‌ఆర్-15048 (తెలంగాణ సోనా)లతో పాటు ప్రైవేట్ విత్తన కంపెనీలకు చెందిన జైశ్రీరాం, కావేరి చింటూ, జీనెక్స్ చిట్టిపొట్టి, ధనిష్ట, సూపర్ అమన్, సౌభాగ్య, అన్నపూర్ణ, బయోసీడ్-504, పల్లవి, అంకుర్, అమని, అమోఘ్ తదితర రకాలను రైతులు సాగు చేస్తున్నారు. ఇందులో ఎంటీయూ-1224, 1271, 1282, ఆర్‌ఎన్‌ఆర్-15048 రకాలకు డిమాండ్ పెరిగి 33వేల ఎకరాల్లో సాగు అవుతుండటం విశేషం. ప్రభుత్వం సన్న రకం వడ్లకే మద్దతు ధరకు అదనంగా రూ.500 బోనస్ ప్రకటించడంతో రాష్ట్రవ్యాప్తంగా రైతులు సన్న రకాల సాగుకే మొగ్గుచూపుతుండగా భూపాలపల్లి జిల్లాలోనూ దీనికి ప్రాధాన్యం పెరిగింది. ఇదే క్రమంలో ప్రభుత్వం ప్రకటించిన సన్న రకాల జాబితాలో ఉన్న వెరైటీలతోపాటు పలు ప్రైవేట్ కంపెనీల రకాలను కూడా సాగుచేస్తున్నారు. రేషన్ దుకాణాల్లో సన్నబియ్యం పంపిణీ చేస్తామని ప్రభుత్వం ప్రకటించడం, పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లోనూ సన్నబియ్యం వండిపెడుతున్న నేపథ్యంలో ఈ సీజన్‌లో ఇబ్బడిముబ్బడిగా సన్న రకాల వరి సాగు పెరిగింది. తద్వారా రాష్ట్రంలో సన్నబియ్యం కొరత తీరుతుందని ప్రభుత్వం భావిస్తోంది.


మొలకెత్తిన వడ్లను చల్లుతున్న రైతు దంపతులు

మార్కెట్లో భలే డిమాండ్

ఈ ఏడాది బహిరంగ మార్కెట్లో సన్న బియ్యానికి భారీగా డిమాండ్ ఉంది. వడ్లకు రూ.2,500 నుంచి 3,200 వరకు ధర పలకగా సన్న రకం పాత బియ్యానికి క్వింటాల్‌కు రూ.5500-8000 వరకు ధర ఎగబాకింది. కొన్ని దొడ్డు రకాల వడ్లు మార్కెటింగ్‌లో ఇబ్బందులు తలెత్తడంతో సన్న రకాలపై ఆసక్తి చూపుతున్నట్లు తెలుస్తోంది. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఏవైనా ఇబ్బందులు ఉన్నా ప్రైవేట్ వ్యాపారులకు అమ్ముకోవచ్చని అన్నదాతలు ఆలోచిస్తున్నారు. వడ్లను మిల్లుల్లో పట్టించి బియ్యం సైతం విక్రయించొచ్చని అభిప్రాయంతో ఉన్నారు. ప్రస్తుతం ఈ సీజన్‌లో బోర్లు, బావుల కింద వరి నాట్లు మొదలు కాగా చెరువులు, కుంటల కింద రైతులు నార్లు పోశారు. పలువురు నాట్లు వేయించడం కాకుండా వెదజల్లే పద్ధతి(బ్రాడ్‌కాస్టింగ్ మెథడ్)లో వరిని సాగు చేస్తున్నారు. కొద్దిగా మొలకెత్తిన వడ్లను పొలంలో చల్లే ప్రక్రియ కొనసాగుతోంది.

ఖర్చులు ఎక్కువైనా..

యాసంగిలో సన్నరకాల సాగు మరీ తక్కువగా ఉంటుండగా వానాకాలంలో సాధారణంగా సాగు విస్తీర్ణంలో 40-50 శాతం సన్న రకాల వడ్లు సాగవుతాయి. దొడ్డు వడ్ల వెరైటీలతో పోలిస్తే సన్న రకం వరి సాగుకు పెట్టుబడి అధికమవుతుంది. సన్న రకాలకు తెగుళ్లు, చీడపీడల బాధ ఎక్కువగా ఉంటుండగా నివారణ, నియంత్రణ కోసం పురుగుమందులు స్ప్రే చేయాల్సి ఉంటుంది. దొడ్డురకం వరి దిగుబడితో పోలిస్తే సన్న రకాలు తక్కువ దిగుబడినిస్తాయి. అయినప్పటికీ ప్రస్తుత పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని వ్యయప్రయాసలకోర్చి రైతులు సన్నాల సాగు వైపు అడుగేశారు.

యునెస్కో సదస్సుకు

రామప్ప ప్రతినిధులు

ఢిల్లీ వెళ్లిన పాండురంగారావు బృందం



న్యూఢిల్లీలో జరిగిన యునెస్కో సదస్సుకు హాజరైన రామప్ప ప్రతినిధులు ప్రొఫెసర్ పాండురంగారావు, శ్రీధర్

వెంకటాపూర్(రామప్ప), జూలై 27: భారత సాంస్కృతిక మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఢిల్లీలో జరుగుతున్న వరల్డ్ హెరిటేజ్ కమిటీ సదస్సుకు రామప్ప ప్రతినిధులుగా వరంగల్ నిట్ రిటైర్డ్ ప్రొఫెసర్ పాండురంగారావు, మాజీ ఐఏఎస్ అధికారి పాపారావు, కాకతీయ హెరిటేజ్ ట్రస్టు సభ్యుడు శ్రీధర్‌రావు హాజరయ్యారు. న్యూఢిల్లీలో ఈనెల 21 నుంచి ఈ సదస్సు జరుగుతోంది. 31 వరకు కొనసాగనుంది. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న వారసత్వ కట్టడాలకు సంబంధించిన ప్రతినిధులు ఇందులో పాల్గొంటున్నారు. రామప్ప ప్రతినిధులు శనివారం పాల్గొన్నారు. భారతదేశంలోనే 39వ వారసత్వ కట్టడంగా గుర్తింపు పొందిన రామప్ప ఆలయ అభివృద్ధి, ప్రగతి నివేదికను ముగ్గురు ప్రతినిధులు యునెస్కో సదస్సులో సమర్పించారు. 2021లో చైనాలో జరిగిన ప్రగతి నివేదిక సదస్సుకు కొవిడ్ కారణంగా వెళ్లలేదని, ఆన్‌లైన్ ద్వారా రామప్ప ప్రగతి నివేదిక సమర్పించామని వారు చెప్పారు.

సీపీఆర్‌పై అవగాహన కలిగి ఉండాలి

భూపాలపల్లి కలెక్టర్ రాహుల్‌శర్మ


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్‌శర్మ

భూపాలపల్లి కలెక్టరేట్, జూలై 27: సీపీఆర్ ప్రక్రియపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని కలెక్టర్ రాహుల్‌శర్మ అన్నారు. దివంగత రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్‌కలాం వర్ధంతి సందర్భంగా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో శనివారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడారు. అస్వస్థతకు గురై ఆకస్మాత్తుగా పడిపోయిన వ్యక్తులకు తక్షణమే సీపీఆర్ అందించడం ద్వారా ప్రాణాలు దక్కే అవకాశం ఉందన్నారు. హఠాత్తుగా గుండెపోటుకు గురైన వ్యక్తులకు సీపీఆర్ చేసే విధానంపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలన్నారు. ఈకార్యక్రమంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, డీఎంహెచ్‌వో మధుసూదన్, సీపీవో శామ్యూల్, డీపీవో నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

సింగరేణి బ్లాస్టింగ్స్ పరిశీలనకు కమిటీ ఏర్పాటు

భూపాలపల్లి మండలం గుర్రంపేట ఎస్సీ కాలనీలో సింగరేణి బ్లాస్టింగ్ వల్ల ఏర్పడుతున్న ఇబ్బందుల పరిశీలనకు కమిటీని ఏర్పాటు చేస్తున్నట్లు కలెక్టర్ రాహుల్‌శర్మ తెలిపారు. కలెక్టరేట్‌లో రెవెన్యూ, సింగరేణి అధికారులతో ఆయన సమావేశమయ్యారు. గుర్రంపేట గ్రామంలో సింగరేణి ఓసీ-3 వల్ల ఏర్పడుతున్న సమస్యలపై సమీక్షించారు. ఆర్అండ్‌బీ, వ్యవసాయశాఖ, డీపీవో, పరిశ్రమలశాఖ, కాలుష్యనియంత్రణ మండలి, పర్యావరణ శాఖ అధికారులు, ఆర్డీవో, ఎంపీడీవోలతో కమిటీని ఏర్పాటుచేసినట్లు తెలిపారు. గ్రామంలో పర్యటించి 15రోజుల్లో నివే దిక అందించా లని కమిటీ సభ్యులను ఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, ఆర్డీవో మంగిలాల్ తదితరులు పాల్గొన్నారు.

విస్తారంగా వర్షాలు


వాజేడు మండలం గొల్లగూడెం వద్ద నీట మునిగిన రేకుల షెడ్డు

- తగ్గినట్టే తగ్గి జోరందుకున్న వాన
- పొంగి పొర్లుతున్న వాగులు, వంకలు
- స్తంభించిన రాకపోకలు
- అప్రమత్తంగా ఉన్న అధికారులు

ములుగు/భూపాలపల్లి టౌన్, జూలై 27: తగ్గినట్టే తగ్గిన వాన మళ్లీ జోరందుకుంది. శుక్రవారం అర్ధరాత్రి నుంచి ములుగు జిల్లాలో శనివారం రోజంతా జోరు వాన కురిసింది. ఏజెన్సీ మండలాల్లో ఎడతెరిపి లేకుండా వాన పడటంతో జనజీవనం స్తంభించింది. ఏటూరునాగారం మండలం రామన్నగూడెం వద్ద రెండో ప్రమాద హెచ్చరిక స్థాయి నుంచి క్రమంగా వరద తగ్గుతోంది. ఎగువ నుంచి కూడా వరదలో తగ్గుదల నమోదవుతోంది. దీంతో తీర ప్రాంత ప్రజలు ఊపిరి పీల్చుకుంటుండగా వాగుల్లో ఉధృతి పెరుగుతోంది. దయ్యాలవాగు, జంపన్నవాగు తోపాటు ఏటూరునాగారం, కన్నాయిగూడెం, మంగపేట, వాజేడు, వెంకటాపురం మండలాల్లోని వాగులు పొంగుతున్నాయి. దీంతో కలెక్టర్ టి.ఎస్.దివాకర, ఎస్పీ శబరీశ్ క్షేత్రస్థాయి పర్యటనలు చేశారు. గోదావరి వరద, గోవిందరావుపేట మండలంలోని దయ్యాలవాగు, వాజేడు -ఛత్తీస్‌గఢ్ మధ్య 163 జాతీయ రహదారిపై ప్రవహిస్తున్న కడేకల్ వాగు, కన్నాయిగూడెం మండలం కంతనపల్లి వద్ద రోడ్డుపై పొంగుతున్న వాగుల ఉధృతిని పరిశీలించి అధికారులను అప్రమత్తం చేశారు. ఎస్పీ సూచనతో డీడీఆర్ఎఫ్ బృందాలను సన్నద్ధం చేశారు. వాగుల వద్ద అత్యవసర పరిస్థితి ఏర్పడితే వెంటనే స్పందించే విధంగా ఆదేశాలు జారీ చేశారు. జిల్లా వ్యాప్తంగా 42.9మి.మీ సగటు వర్షపాతం నమోదైంది. అత్యధికంగా వెంకటాపురం (నూగూరు)లో 63.2 మి.మీ, తాడ్వాయి మండలంలో 58మి.మీ, ఏటూరునాగారంలో 56.8మి.మీ, మంగపేటలో 54.4మి.మీ వర్షం కురిసింది. కన్నాయిగూడెంలో 40.4మి.మీ, గోవిందరావుపేటలో 30.2మి.మీ, వెంకటాపూర్ (రామప్ప)లో 25.6మి.మీ, ములుగు మండలంలో 18.6మి.మీ, వాజేడులో 39.4మి.మీ వర్షం కురిసింది.

జనం అతలాకుతలం..

ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో భూపాలపల్లి జిల్లాలో పలుచోట్ల రాకపోకలు నిలిచిపోయాయి. పంట నష్టం జరిగింది. కాటారం మండలంలోని పోతులవాయి, గంగారం, ఒడిపిలవంచా, మల్లారం గ్రామాలకు సమీపంలో ఉన్న అలుగువాగు, బొర్రవాగు, బండలవాగు, పెద్దవాగులు ఉప్పొంగడంతో పలు గ్రామాల ప్రజలకు రాకపోకలు నిలిచిపోయాయి. లోతట్టు ప్రాంతాల్లోని పంటల్లో నీరు నిలిచి సుమారు 150 ఎకరాల్లో పత్తి, వరి పంటలు దెబ్బతిన్నాయి. గంగారంలోని ముల్కల రమేష్‌కు చెందిన ఇల్లు కూలిపోయింది. మల్హర్ మండలంలోని మల్లారం ఆరెవాగు ఉప్పొంగింది. మానేరువాగు ఉధృతంగా ప్రవహించింది. తాడిచర్ల ఓపెన్‌కాస్టులో వారం రోజుల నుంచి బొగ్గు ఉత్పత్తి నిలిచిపోవడంతో సుమారు రూ.8కోట్లు నష్టం వాటిల్లింది.

భూపాలపల్లిలోని ఓసీ-2, 3లలో సుమారు 45వేల టన్నుల బొగ్గు ఉత్పత్తికి అంతరాయం కలుగగా రూ.14కోట్లు నష్టం వాటిల్లినట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. మహాముత్తారం మండల కేంద్రానికి వచ్చే కోనంపేట శివారు వాగు ఉప్పొంగడంతో రాకపోకలు నిలిచిపోయాయి. కాటారం-మేడారం రహదారిలో లోలెవల్ కల్వర్టుపై నుంచి వరద నీరు ఉధృతి పెరగడంతో రవాణా స్తంభించింది.


కాటారం మండలంలో కాజ్‌వే పైనుంచి ఉధృతంగా ప్రవహిస్తున్న బొర్రవాగు


గోవిందరావుపేట మండలం రాఘవపట్నం వద్ద దయ్యాలవాగు ఉధృతిని పరిశీలిస్తున్న కలెక్టర్ దివాకర

ఏజెన్సీలో

హైఅలర్ట్

- నేటి నుంచి మావోయిస్టు అమరవీరుల సంస్మరణ వారోత్సవాలు
- అప్రమత్తమైన పోలీసులు
- అడవుల్లో కూంబింగ్, రహదారుల్లో తనిఖీలు

వివరాలు 8వ పేజీలో...

మహోగ్ర బొగత


← ఉధృతంగా ప్రవహిస్తున్న బొగత జలపాతం

వాజేడు, జూలై 27: తెలంగాణ నయాగరా బొగత జలపాతం మహోగ్ర రూపం దాల్చింది. ఓ వైపు ఎడతెరిపి లేని వర్షాలు, మరోవైపు ఉప్పొంగి ప్రవహిస్తున్న వాగులకు జలపాతానికి భారీగా వరద నీరు చేరి ప్రమాదకరంగా ప్రవహిస్తోంది. జలపాతం ముందు భాగంలో ఉన్న ఈత కొలనును వరద నీరు కమ్మేసింది. ట్రీహౌజ్ చుట్టూ నీళ్లు చేరాయి. అతి ప్రమాదకర స్థాయిలో జలపాతం ప్రవాహం ఉండటంతో దీని సందర్శనకు పర్యాటకులను అటవీ శాఖ అధికారులు అనుమతించడం లేదు.



మేడారం పూజారి మృతికి మంత్రుల సంతాపం

మేడారం, జులై 27 : తాడ్వాయి మండలం మేడారం సారలమ్మ పూజారి కాక సంపత్ మృతికి రాష్ట్ర దేవాదాయ, అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ, పంచాయతీరాజ్, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి సీతక్క సంతాపం తెలిపారు. పూజారి కుటుంబం పట్ల సానుభూతి వ్యక్తం చేశారు. అండగా ఉంటూ ఆదుకుంటామని హామీ ఇచ్చారు.







MUKTA RAMAKRISHNA ABIDS	PRASADS LARGE SCREEN NTR GARDENS	MOVIEMAX AMR MALL SECUNDERABAD
AMB CINEMAS GACHHIBOWLI	AAA CINEMAS AMEERPET	PLATINUM MOVIE TIME GACHIBOWLI

PVR - INOX CINEMAS :- INORBIT MALL CYBERABAD | SUJANA FORUM PRESTIGE MALL, KPBH | ICON HYDERABAD NEXT GALLERIA, MADHAPUR | PLAY HOUSE HYDERABAD NEXT GALLERIA, PANJAGUTTA | NEXT GALLERIA ERRAMANZIL | MUSARAMBAGH | CENTRAL MALL, PANJAGUTTA | RK MALL, BANJARA HILLS | ATRIUM MALL, GACHIBOWLI | PRESTON MALL, GACHIBOWLI | PRISM MALL | S2 CINEMAS MALLAPUR | GVK ONE MALL, BANJARA HILLS | MAHESHWARI PARMESHWARI MALL | GSM MALL, MIYAPUR | SATTA NECKLACE MALL, KAVADIGUDA | ASHOKA, KUKATPALLY

MIRAJ CINEMAS :- SHALINI SIVANI, DSKN | BALANAGAR | CHANDA NAGAR | MIYAPUR | MALJKAGIRI

CINEPOLIS :- LULU MALL, KUKATPALLY | MANTRA MALL, ATTAPUR | CCPL, MALKAJGIRI | SUDHA, SHALIBANDA | DSL, UPPAL

ASIAN CINEMAS :- CINESQUARE MULTIPLEX - UPPAL | SHIVA GANGA | CINE PLANET - KOMPALI | RADHIKA - KAPRA | M CUBE MALL MULTIPLEX - ATTAPUR | SHA - CHINTAL HMT | MUKTA A2 MJR CINEMAS | A2 SENSATIONS | CINEPRIDE SHASHIKALA MOOSAPET | ASR SWAPNA - KATHADAN | VAISHNAVI - R.C.PURAM | CINE TOWN - KARMANGHAT

MOVIE TIME AMEERPET	MOVIE TIMES SKY MALL SANATHNAGAR	JPRASAD MULTIPLEX MADANIGUDA
GRP MALL & MULTIPLEX KUKATPALLY	APASARA CINEMAS NALLAGANDLA	VENKATRAMANA KACHIGUDA
TARAKARAMA THEATRE KACHIGUDA	DEVI 70MM RTC.X.ROAD	BVK VIJAYALAKSHIMI L B NAGAR
TIVOLI CINE HOME SECUNDERABAD	SAI RAM THEATRE MALKAJGIRI	SHANTHI RTC CROSS ROAD
BHRAMARAMBA KUKATPALLI	RAJADHANI 70MM DILSHUKNAGAR	RAJADHANI DELUXE DILSHUKNAGAR
SRI RAMANA 35MM AMBEERPET	MAHALAXMI THEATRE KOTHAPET	BHUJANGA THEATRE JEEDIMATLA

FARNAZ

ఆర్థిక ఇబ్బందులతో జీపీ కార్యదర్శి ఆత్మహత్య


వెంకటేష్ మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు


వెంకటేష్(ఫైల్)

తొర్రూరు, జూలై 27 : ఆర్థిక ఇబ్బందులతో గ్రామ పంచాయతీ కార్యదర్శి మృతి చెందిన ఘటన శనివారం తొర్రూరులో చోటు చేసుకుంది. స్థానికులు, ఎస్సై జగదీష్ తెలిపిన ప్రకారం. మహబూ బాబాద్ జిల్లా తొర్రూరు పట్టణానికి చెందిన పేర్ల వెంకటేష్ (32) దంతాలపల్లి మండలం లక్ష్మీపురం గ్రామ పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్నాడు. కార్యదర్శుల వేతనాలు పెంచాలని కోరు తూ గతంలో సమ్మె చేసిన నేపథ్యంలో వేతనాలు రాకపోవడం, ఒకసారి విధుల నుంచి సస్పెండ్ కావడంతో మనోవేదనకు గురయ్యా డు. ఈ క్రమంలో ఆర్థిక ఇబ్బందులు తీవ్రంగా ఉండడంతో సతమతమవుతున్నాడు. శనివారం ఉదయం 11 గంటలకు ఇంటి నుంచి వెళ్లి పట్టణ శివారులోని వ్యవసాయ బావిలో దూకి వెంకటేష్ ఆత్మహత్య చేసుకున్నాడు. గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో గజ ఈతగాళ్లు, ఫైర్ సిబ్బంది సాయంతో శవా న్ని బయటకు తీసి పంచనామా నిర్వహించారు. మృతుడి భార్య పేర్ల లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.













టీచర్లూ.. సెల్యూట్

తాము పనిచేసే సర్కారు బడిలోనే పిల్లలకూ చదువులు ● ఉమ్మడి జిల్లాలో ఆదర్శంగా నిలుస్తున్న గురువులు

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్)

ప్రభుత్వ బడిలో పాఠాలు చెప్పడమే కాదు... తమ పిల్లలను కూడా సర్కారు బడిలో చేర్పించి చదువులు చెప్పిస్తున్నారు కొందరు టీచర్లు. ప్రస్తుత పరిస్థితుల్లో నిరుపేదలు, మధ్యతరగతి వారు సైతం అప్పో సప్పో చేసి తమ పిల్లలను ప్రైవేట్, కార్పొరేట్ బడులు, కళాశాలలకు పంపిస్తున్నారు. మరి ప్రభుత్వ ఉద్యోగులైతే.. మరింత పేరున్న సంస్థల్లో చదివిస్తున్నారు. అందులో ప్రభుత్వ ఉపాధ్యాయుల్లో చాలా మంది తమ పిల్లలను ప్రైవేటు పాఠశాలల్లో చేర్పుతున్నారు. తమ పిల్లల చదువుల కోసమే అనేకమంది తమ సొంత ఊళ్లను వదిలి నగరాల్లో స్థిరపడిపోతున్నారు. అయితే సర్కారు విద్యావ్యవస్థ బలోపేతానికి తీసుకునే చర్యల్లో భాగంగా ఉపాధ్యాయులు ప్రతీఏటా బడిబాట కార్యక్రమాలతో గ్రామాల్లోకి వెళుతున్నారు. ఆ సమయంలో 'మీ పిల్లలనేమో ప్రైవేటుబడికి పంపుతారా? మా పిల్లలేమో సర్కారు బడికి పంపాలా?' అనే ప్రశ్నలు తల్లిదండ్రుల నుంచి ఎదురవుతున్నాయి. కానీ ఇలాంటి పరిస్థితుల్లో తమ పిల్లలను సర్కారు బడుల్లో చదివిస్తూ ఆదర్శంగా నిలుస్తున్న ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన పలువురు ఉపాధ్యాయులపై 'ఆంధ్రజ్యోతి' ఆదివారం ప్రత్యేక కథనం.

సకల సౌకర్యాల సర్కారు బడి...

ప్రభుత్వ బడిలో అనేక సౌకర్యాలు అందుబాటులోకి వచ్చాయి. బోధనలో నిష్ణాతులైన ఉపాధ్యాయులనే ప్రభుత్వం నియమిస్తుంది. దీంతోపాటు ప్రభుత్వం మన ఊరు.. మన బడి, మన బస్తీ- మన పాఠశాల, పీఎంశ్రీ, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలతో అనేక పాఠశాలల్లో వివిధ అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతోంది. విద్యార్థులకు పాఠశాలల్లో కనీస సౌకర్యాలు కల్పిస్తోంది. ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా కొన్నిచోట్ల ప్రభుత్వ బడుల్లో కూడా డిజిటల్ విద్యను అందిస్తున్నారు. ఉచితంగా స్కూల్ యూనిఫాం, పుస్తకాలు, మధ్యాహ్నం భోజనం అందిస్తుండటంతో చాలా ప్రాంతాల్లో ప్రైవేట్ నుంచి విద్యార్థులు ప్రభుత్వ బడికి మారేందుకు ఆసక్తి చూపుతున్నారు. పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత లేకుండా ఖాళీలను ప్రభుత్వం భర్తీ చేస్తోంది. అంతేకాకుండా ప్రభుత్వ పాఠశాలల్లో డీఎడ్, బీఎడ్, ఎంఎడ్ తదితర ఉపాధ్యాయ శిక్షణ కోర్సులను పూర్తి చేసిన వారినే టీచర్లుగా నియమిస్తోంది. విద్యార్థులపై ఎలాంటి ఒత్తిడి లేకుండా ప్రణాళిక ప్రకారం పాఠాల బోధన జరుగుతోంది. దీంతో పలువురు ప్రభుత్వ ఉపాధ్యాయులు కూడా పునరాలోచనలో పడ్డారు. తాము విద్యార్థులను బడిలో చేర్పించాలని ఇళ్ల వద్దకు వెళ్లినప్పుడు.. 'మీ పిల్లలను ప్రభుత్వ బడిలో ఎందుకు చేర్పరు..' అని తల్లిదండ్రుల నుంచి ఎదురైన ప్రశ్నలకు కొందరు సమాధానం ఇస్తున్నారు. తాము చెప్పే విద్యనే తమ పిల్లలకు కూడా అందించాలనే తాపత్రాయంతో ఉమ్మడి జిల్లాలోని చాలామంది టీచర్లు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చదివిస్తున్నారు. ప్రైవేటు పాఠశాలల్లో చదివించే ఆర్థికస్థోమత ఉన్నా ప్రభుత్వం పాఠశాలల్లోనే నిష్ణాతులైన ఉపాధ్యాయులు ఉన్నారని, కితాబివ్వడమేకాదు.. ప్రజల్లోనూ నమ్మకం కలిగించేలా తమ పిల్లలను సర్కారు బడిలో చదివిస్తున్నారు. అంతేకాకుండా ప్రైవేట్ బడిలో ఉండే ఇంగ్లీషు మీడియం సర్కారు బడిలో కూడా ఉండటంతో ఇతర పిల్లలను కూడా ప్రోత్సహిస్తూ సర్కారు బడిలో చదువుకునేలా కృషి చేస్తూ ప్రశంసలు అందుకుంటున్నారు.

ఒత్తిడి లేని చదువు ప్రభుత్వ బడిలోనే..

'మేం 1వ తరగతి నుంచి పీజీ వరకు ప్రభుత్వ విద్యనే అభ్యసించాం. ఏ ఒత్తిడి లేకుండా చదువుకుని ఉపాధ్యాయులుగా స్థిరపడినాం. మా పిల్లలకు ఒత్తిడి లేని చదువు కోసం ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాం.. మా ఇద్దరు పిల్లలను సర్కారు బడిలోనే చదివిస్తున్నాం' అని ఉపాధ్యాయ దంపతులు శ్యామలత, రాజు చెబుతున్నారు. శ్యామలత మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం కాట్రాపల్లి జడ్పీఎస్ పాఠశాలలో, రాజు గూడూరు మండలం గుండెంగ ప్రాథమికోన్నత పాఠశాలలో గణితం టీచర్లుగా పని చేస్తున్నారు. వారి ఇద్దరు పిల్లలు హిమాన్షుసహన్, కొవిద్‌సహన్ వరంగల్‌లోని చార్‌బౌలి ప్రభుత్వ పాఠశాలలో ఆరు, ఎనిమిది తరగతులు చదువుతున్నారు. ప్రైవేటు పాఠశాలల్లో హోం వర్క్ పేరుతో విద్యార్థులపై ఒత్తిడి ఉంటుందని ఆ ఉపాధ్యాయ దంపతులు అంటున్నారు. ఇద్దరూ ప్రభుత్వ ఉపాధ్యాయులే అయినా పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చదివిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు.

ఇద్దరు పిల్లలు సర్కారు బడికే..

ములుగు జిల్లా బండారుపల్లి గ్రామంలోని తెలంగాణ మోడల్ స్కూల్‌లో టీజీటీగా పని చేస్తున్న సుధారాణి తన ఇద్దరు పిల్లలను అదే పాఠశాలలో చదివిస్తున్నారు. తన కుమారుడు సుమితేష్ 8వ తరగతి, కుమార్తె సంవిద 6వ తరగతి టీజీఎంఎస్‌లో చదువుతున్నారు. అలాగే ఇనుగుర్తి మండల కేంద్రంలో ప్రాథమిక పాఠశాలలో ఎస్‌జీటీగా పని చేస్తున్న ఎం.వెంకటేశ్వరాచారి తన ఇద్దరు పిల్లలను ప్రభుత్వ పాఠశాలలోనే చదివిస్తున్నారు. ఇదే గ్రామంలోని జడ్పీఎస్ పాఠశాలలో కుమారు చైతన్యరిషి 8వ తరగతి చదువుతుండగా, కుమార్తె ఆరాధ్య 6వ తరగతి చదువుతోంది. చైతన్యరిషి 2వ తరగతి నుంచి, ఆరాధ్య 1వ తరగతి నుంచి ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యాభ్యాసం చేస్తున్నారు. తాను చదువు చెప్పే సర్కారు బడిలోనే నాణ్యమైన విద్య ఉందని, నిష్ణాతులైన ఉపాధ్యాయులు ప్రభుత్వ బడిలో ఉన్నారని, పిల్లల భవిష్యత్తు కోసం ప్రభుత్వ బడిలోనే చదివిస్తున్నామని ఆ ఉపాధ్యాయులు పేర్కొంటున్నారు.

ఆ ఉపాధ్యాయుల పిల్లలంతా సర్కారుకే..

మరిపెడ మండలం సీతారాంపురంతండా, మరిపెడ ప్రాథమికోన్నత పాఠశాలల్లో పని చేస్తున్న ఐదుగురు ఉపాధ్యాయులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చదివిస్తున్నారు. మరిపెడ జడ్పీఎస్ పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న నందిగామ జనార్దనాచారి తన కుమార్తె సరస్వతిని పదోతరగతి, మరో ఉపాధ్యాయుడు సారయ్య తన కుమార్తె దేవిని ఏడోతరగతి, ఉపాధ్యాయుడు లాల్‌చంద్ తన కుమార్తె మైథిలీని ఏడోతరగతి, కె.వెంకటేశ్వర్లు, అనురాధ దంపతుల పిల్లలు మరిపెడ ప్రభుత్వ మోడల్ స్కూల్‌లో ఇస్మిత 8వ తరగతి, హర్షద్ 7వ తరగతి చదివిస్తున్నారు. వీరే కాకుండా దంతాలపల్లి జడ్పీఎస్ పాఠశాలలో పనిచేస్తున్న హిందీ పండిట్ డి.పరంకుశచారి 9వ తరగతి చదువుతున్న తన కుమార్తె సిరిచందనను ప్రభుత్వ పాఠశాలలో చదివిస్తున్నారు. అలాగే కొత్తగూడ మండలానికి చెందిన పుల్సం కవిత తన కుమార్తె సాహిత్యను గూడూరుకు చెందిన ఉపాధ్యాయుడు తాటి బుచ్చిరాములు తన ఇద్దరు పిల్లలు వేదశ్రీ 2వ తరగతి, గాయత్రి 1వ తరగతిలను ప్రభుత్వ పాఠశాలల్లో చదివిస్తున్నారు. ఇలా ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా అనేక మంది ఉపాధ్యాయులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చదివిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు.

తాను చదువు చెప్పే బడిలోనే..

హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండల కేంద్రంలోని జడ్పీఎస్ పాఠశాలలో స్టాలిన్ బేగ్ గణిత ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నారు. కొత్తపల్లి గ్రామానికి చెందిన స్టాలిన్‌బేగ్ తాను పాఠాలు చెప్పుతున్న బడిలోనే తన ఇద్దరు పిల్లలను కూడా చదివిస్తున్నారు. ఇటీవలే భీమదేవరపల్లి పాఠశాలలో కుమార్తె పదో తరగతి పూర్తి చేయగా.. కుమారుడు తల్హార్‌బేగ్ తొమ్మిదో తరగతి చదువుతున్నాడు. 1వ తరగతి నుంచి 10వ తరగతి వరకు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చదివిస్తున్న స్టాలిన్‌బేగ్ ఇతర ఉపాధ్యాయులకు ఆదర్శంగా నిలుస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉండే నిష్ణాతులైన ఉపాధ్యాయులు ప్రైవేట్ బడిలో ఉండరని, ప్రభుత్వ పాఠశాలల్లో క్రమశిక్షణ విద్యార్థుల భవిష్యత్‌కు మార్గదర్శకంగా ఉంటుందని స్టాలిన్‌బేగ్ పేర్కొంటున్నారు.



కారులో కూరగాయల విక్రయం

జూలైవాడ, జూలై 27: కూరగాయలను సైకిళ్లు, తోపుడు బండ్లపై వాడవాడల తిరుగుతూ విక్రయించేవారు. ఎలాంటి అద్దె ఖర్చు లేకుండా మొబైల్ వాహనాలపై వివిధ రకాల వ్యాపారాలు నిర్వహిస్తున్నారు. ఎక్కువగా శాతం వాహనాలపై ఉదయం, సాయంత్రం వేళల్లో టిఫిన్ సెంటర్లు కొనసాగుతున్నాయి. ఓ యువకుడు వినూత్నంగా ఆలోచించి కారునే కూరగాయల విక్రయ కేంద్రంగా మార్చుకున్నాడు. శనివారం హనుమకొండ గ్రేటర్ 59వ డివిజన్ పరిధిలోని ఎక్సైజ్ కాలనీలో ఖరీదైన కారులో వివిధ రకాల కూరగాయలు విక్రయిస్తూ పలువురిని ఆకర్షించాడు. కారు వెనుక డిక్కీలో తూకం మిషన్ ఏర్పాటు చేసుకొని కూరగాయలు విక్రయిస్తున్నాడు.



కారులో కూరగాయలు విక్రయిస్తున్న దృశ్యం

పెండింగ్ స్లాట్‌లకు హాజరుకావాలి..

డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ శ్రీనివాస్ పుప్పాల

వరంగల్ క్రైం, జూలై 27: హనుమకొండ రవాణా శాఖ కార్యాలయంలో జనవరి 2020 నుంచి ఇప్పటి వరకు స్లాట్ బుక్ చేసుకున్న అప్లికేషన్లు 1,263 పెండింగ్‌లో ఉన్నాయని, వాటికి హాజరుకావాలని డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ శ్రీనివాస్ పుప్పాల ఒక ప్రకటనలో కోరారు. వాహన యజమానులు, డ్రైవింగ్ లైసెన్సుదారులు రవాణాశాఖ వెబ్‌సైట్‌లో స్లాట్ బుక్ చేసుకుని, ఫీజు చెల్లించి కార్యాలయానికి వచ్చి డ్రైవింగ్ టెస్ట్, వాహన ఇన్స్‌పెక్షన్ వంటివి చేయించకపోవడం వల్ల దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. దీని వలన ఏదైనా న్యాయపరమైన సమస్యలు, ఇన్సూరెన్స్ సమస్యలు వచ్చినప్పుడు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని ఆయన తెలిపారు. దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నవారు చింతగట్టు క్యాంపు వద్ద ఉన్న కార్యాలయంలో సంప్రదించి పరిష్కరించుకోవాలని శ్రీనివాస్ సూచించారు.

కమిషనరేట్‌లో ముగ్గురు సీఐల బదిలీ

వరంగల్ క్రైం, జూలై 27: వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని ముగ్గురు సీఐలను బదిలీ చేస్తూ ఆదివారం కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఉత్తర్వులు జారీ చేశారు. ఒ.రమేశ్ కమిషనరేట్ నుంచి సీసీఎస్ వరంగల్, పి.దామోదర్ కమిషనరేట్ నుంచి సీసీఎస్ వరంగల్, ఎం.రంజిత్‌కుమార్ కమిషనరేట్ నుంచి వరంగల్ టాస్క్‌ఫోర్స్‌కు కేటాయించారు.

ఎంజీఎం మాజీ సూపరింటెండెంట్ బదిలీపై వెలసిన ఫ్లెక్సీలు



వరంగల్ మెడికల్, జూలై 27: ఇటీవల ఎంజీఎం ఇన్‌చార్జి సూపరింటెండెంట్ వి.చంద్రశేఖర్ ములుగు వైద్య కళాశాలకు ప్రొఫెసర్‌గా బదిలీ కావడంపై ఎంజీఎం ఉద్యోగులు హర్షం వ్యక్తం చేస్తూ ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. ఇన్ని రోజులు ఎంజీఎంకు పట్టిన పీడ విరగడ అయిందంటూ ఎంజీఎం గేటుకు ఫ్లెక్సీని గుర్తు తెలియని వ్యక్తులు శుక్రవారం రాత్రి ఏర్పాటు చేశారు. కాగా, ఈ ఘటన పెద్దాస్పత్రిలో చర్చనీయాంశంగా మారింది.

ఎన్పీడీసీఎల్ స్టోర్‌ను తనిఖీ చేసిన ఎస్ఈ

హనుమకొండ టౌన్, జూలై 27:ఎన్పీడీసీఎల్ పరిధిలోని ఉమ్మడి వరంగల్ జిల్లాకు సంబంధించిన విద్యుత్ సామగ్రిని సరఫరా చేసే స్టోర్‌ను హనుమకొండ ఎస్ఈ కె. వెంకటరమణ శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా టీఅండ్‌డీ వర్క్స్ కొత్త సర్వీసుల రిలీజ్‌లు, ఇతరత్రా అవసరాలు తీర్చడానికి స్టోర్‌లో మెటీరియల్ లభ్యతపై ఆరా తీశారు.

విద్యార్థి సంఘ నాయకులపై చర్యలు తీసుకోవాలి

కలెక్టర్‌కు ప్రైవేట్ జూనియర్ కళాశాలల యాజమాన్య సంఘం వినతి

హనుమకొండ కలెక్టరేట్, జూలై27: కొందరు విద్యార్థి సంఘాల పేర్లు చెప్పుకుంటూ ప్రైవేట్ జూనియర్ కళాశాలల యాజమాన్యాలను డబ్బులు డిమాండ్ చేస్తూ ఇబ్బంది పెడుతున్నారని వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రైవేట్ జూనియర్ కళాశాలల యాజమాన్య కమిటీ నాయకులు శనివారం హనుమకొండ కలెక్టరేట్‌లోని కలెక్టర్ చాంబర్‌లో కలెక్టర్ ప్రావీణ్యకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు విద్యార్థి సంఘాల నాయకులపై చర్యలు తీసుకోవాలని వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా ప్రైవేట్ జూనియర్ కళాశాలల యాజమాన్య కమిటీ నాయకులు మాట్లాడుతూ.. ఏబీఎస్ఎఫ్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు, ఆర్‌టీపీ, బీఎస్ఎఫ్, ఏఐఎస్‌బీ విద్యార్థి సంఘాల అధ్యక్షులు తమ కళాశాలలకు వచ్చి చందాల వసూళ్లకు పాల్పడుతున్నారని అన్నారు. చందా ఇవ్వని కళాశాలల ముందు విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలనే పేరుతో ధర్నాలు చేస్తూ బెదిరింపులకు పాల్పడుతున్నారన్నారు. నిరుద్యోగులైన తాము ప్రైవేట్ కళాశాలలు పెట్టుకుని ఉపాధి పొందుతూ ఎంతో మంది నిరుద్యోగులకు ఉపాధి కల్పిస్తూ, విద్యార్థులకు కార్పొరేట్ స్థాయిలో విద్యను అందిస్తున్నామన్నారు. విద్యార్థి సంఘాల నాయకులు, కొందరు కుల సంఘాల నాయకులు ఆర్‌టీఏ యాక్ట్ కింద నోటీసులు ఇస్తూ తమను ఒత్తిడి గురి చేస్తున్నారన్నారు. వెంటనే ఈ విద్యార్థి సంఘాల నాయకులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చినట్లు తెలిపారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రైవేట్ జూనియర్ కళాశాలల యాజమాన్య కమిటీ అధ్యక్షుడు సత్యనారాయణ రెడ్డి, కార్యదర్శి రాజు, గౌరవ సలహాదారులు గౌరు తిరుపతిరెడ్డి, కుమార్, రాజిరెడ్డి, రాంమూర్తి, కరుణాకర్, రాష్ట్ర ఉపాధ్యక్షులు అశోక్ రెడ్డి, తాళ్లపల్లి స్వామి తదితరులు ఉన్నారు.



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ప్రైవేట్ జూనియర్ కళాశాలల యాజమాన్య సంఘం నాయకులు

ఆర్టీసీ ఉద్యోగులకు ప్రగతి చక్రం అవార్డులు

బాలసముద్రం, జూలై 27: ఆర్టీసీ ఉద్యోగులకు ప్రగతి చక్రం అవార్డులను శనివారం హనుమకొండ డిపో మేనేజర్ భూక్యా ధరమ్‌సింగ్ ఆధ్వర్యంలో ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ధరమ్‌సింగ్ మాట్లాడుతూ.. ఇంధనాన్ని పొదుపుగా వాడి ఆదాయం తెచ్చి సంస్థను ప్రథమ స్థానంలో నిలపాలని కోరారు. విధి నిర్వహణలో ప్రతీ ఒక్కరు తమ ప్రతిభను కనబరిచి అనుకున్న లక్ష్యాలను చేరుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా సాంస్కృతిక కార్యక్రమాల విజేతలకు విధి నిర్వహణలో ప్రతిభ కనబరిచిన ఉద్యోగులకు బహుమతులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ సూపర్‌వైజర్ నజియాసుల్తానా, మెకానిక్ సూపర్‌వైజర్ వి.చంద్రశేఖర్, ఆర్టీసీ ఉద్యోగులు పాల్గొన్నారు



అవార్డులు పొందిన ఉద్యోగులు

అలంకారప్రాయంగా టీ డయాగ్నోస్టిక్ సెంటర్లు

- రేడియాలజీ పరీక్షలు లేవు..
- ఏడుగురు ఔట్‌సోర్సింగ్ సిబ్బందే..
- డిప్యూటేషన్ సిబ్బందితో సరి

వరంగల్ మెడికల్, జూలై 27: పేద రోగుల సౌకర్యార్థం అట్టహాసంగా ప్రారంభించిన టీడయాగ్నోస్టిక్ కేంద్రం సిబ్బంది కొరతతో విలవిలలాడుతోంది. రేడియాజిస్టు వైద్యులు లేక సేవలు నిచిలిపోయాయి. ప్రభుత్వం ఆశించిన లక్ష్యం కళ్ల ముందే నీరుగారిపోతున్నా పట్టించుకునే వారు కరువయ్యారు. ఎన్నో ఆశలతో సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన రోగులకు రేడియాలజీ సేవలు లేక నిరాశగా వెనుదిరుగుతున్నారు. హనుమకొండ ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన తెలంగాణ డయాగ్నస్టిక్ కేంద్రంపై కథనం.

రేడియాలజీ వైద్యుడు కరువు

ప్రతీ వైద్య చికిత్సలో రేడియాలజీ విభాగానికి అత్యంత ప్రాధాన్యముంటుంది. ఇందులో ప్రధానంగా ఈసీజీ, మెమోగ్రఫీ, అబ్డామిన్ స్కాన్, ఎక్స్‌రే మిషన్లు ఉన్నాయి. కానీ రేడియాలజీ వైద్యులు లేకపోవడంతో ఇవన్నీ మూలనపడ్డాయి. సిటీ, ఎంఆర్ఐ పరికరాలు ఇంతవరకు మంజూరు కూడా కాలేదు. రేడియాలజీ వైద్యుడి కోసం రెండుసార్లు నోటిఫికేషన్ ఇచ్చినా ఎవరూ ముందుకు రాలేదని హబ్ నిర్వాహకులు చెబుతున్నారు. ఉన్నతాధికారులు, ప్రత్యేక చొరవ చూపితే డిప్యూటేషన్‌పై ఓరేడియాలజీని పంపించే అవకాశం ఉన్నప్పటికీ చొరవ చూపకపోవడంతో విభాగం సేవలు నిల్‌గా మారాయని రోగులు ఆవేదన వ్యక్తం చేశారు.

రెండు విభాగాలు మాత్రమే..

టీహబ్‌లో రేడియాలజీ, పాథాలజీ, బయోకెమిస్ట్రీ, మైక్రో బయాలజీ విభాగాలు ఏర్పాటు చేశారు. వీటితో రేడియాలజీ విభాగానికి వైద్యుడు లేకపోవడంతో మొదటి నుంచి మూతపడింది. ఇక బయోకెమిస్ట్‌గా పని చేస్తున్న వైద్యులు ఇటీవల బదిలీల్లో వెళ్లిపోవడంతో ఆ విభాగం మూతపడే దశలో ఉంది. ప్రస్తుతం పాథాలజీ, మైక్రో బయాలజీ విభాగాలు మాత్రం ఏడుగురు ఔట్ సోర్సింగ్ సిబ్బందితో నెట్టుకొస్తున్నారు.

నిత్యం వేయి శాంపిళ్లు

హనుమకొండ జిల్లా వ్యాప్తంగా ఉన్న అర్బన్ సెంటర్లు, బస్తీ దవాఖానాలు, పల్లె దవాఖానాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఈహెచ్ఎస్, ఇలా 33మార్గాల ద్వారా శాంపిళ్లు టీహబ్‌కు చేరుకుంటాయి. స్టెరిలైజేషన్ కోల్డ్ స్టోరేజ్ కలిగిన మూడు వాహనాలు కూడా ప్రతీరోజు మూడు రూట్లలో వెళుతు సాయంత్రం 4గంటల వరకు శాంపిళ్లను సేకరించి, ఆధార్, ఫోన్ నెంబర్లను అనుసంధానం చేస్తున్నారు. పరీక్ష ఫలితాలను నేరుగా వారి మొబైల్‌లకు మెసేజ్ ద్వారా వెళుతున్నాయి.



నిరుపయోగంగా ఉన్న రేడియాలజీ సెంటర్

మల విసర్జన పరీక్షలు లేవు

57 రకాల పరీక్షలు తెలంగాణ హబ్‌లో నిర్వహిస్తున్నప్పటికీ మలవిసర్జన పరీక్షలు మాత్రం రియజెంట్స్ లేవనేసాకుతో కొద్దికాలంగా పరీక్షలు నిలిపివేశారు. ప్రోటీన్ టెస్ట్, హెచ్ బీ పర్సంటేజ్ టెస్టులు కూడా జరగడం లేదు.

మూలనపడ్డ మిషన్లు

టెక్నీషియన్లు అందుబాటులో లేకపోవడంతో కల్చర్ మిషన్, ఎలక్ట్రోఫోర్స్, కాంగ్లో మీటర్ మిషన్లు మూలనపడ్డాయి. ప్రస్తుతం ఈ కేంద్రంలో ఏడుగురు ఔట్‌సోర్సింగ్ సిబ్బంది మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. రోగుల తాకిడికి అనుకూలంగా టెక్నీషిన్లను నియమించాలని డిమాండ్ వ్యక్తం అవుతోంది. మిషన్ కూడా బ్రేక్‌డౌన్ అవుతున్నట్లు టీ హబ్ ఉద్యోగులు వాపోతున్నారు. టీ హబ్‌లో మౌలిక సదుపాయాల మెరుగు కోసం అధికారులు కృషి చేయాలని రోగులు విజ్ఞప్తి చేస్తున్నారు.

అతలాకుతలం



మహాముత్తారం మండలం కాటారం-మేడారం రోడ్డులో పెద్దవాగు లోలెవల్ కల్వర్టుపై నుంచి ప్రవహిస్తున్న వరద నీరు

ఏటూరునాగారం రూరల్, జూలై27: ఏజెన్సీ వ్యాప్తంగా ఎడతెరిపి లేకుండా జోరుగా వాన కురుస్తోంది. శనివారం రోజంతా వర్షం పడింది. దీంతో ఏజెన్సీ అతలాకుతలమైంది. మండలంలోని జంపన్నవాగు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో మండలంలోని ఎలిశెట్టిపల్లి, కొండాయి, మల్యాల గ్రామాల ప్రజలకు రాకపోకలు నిలిచిపోయాయి.చిన్నబోయినపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని రాయబంధానికి రాకపోకలు నిలిచిపోయాయి. నాగులమ్మ ఒర్రె ఉధృతంగా ప్రవహిస్తుండడంతో చల్పాక, అల్లంవారిఘణపురం, వీరాపురం, తదితర గ్రామాలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. రామన్నగూడెం పుష్కరఘాట్ వద్ద ఉగ్ర రూపం దాల్చిన గోదావరి ఉధృతిని ఎస్పీ శబరీశ్ పరిశీలించారు. అధికారులకు పలు సూచ నలు చేశారు. గోదావరి మరింతగా పెరిగితే లోతట్టు ప్రాంతాల ప్రజల కు ఇబ్బందులు కలకుండా పునరావాస కేంద్రాలను తరలిస్తామన్నారు. ఆయన వెంట ఏఎస్పీ శివం ఉపాధ్యాయ, సీఐ శ్రీనివాస్, ఎస్సై తాజుదీన్ ఉన్నారు.

వాజేడు జలమయం

వాజేడు: మండలం జలమయమైంది. శుక్రవారం అర్ధరాత్రి నుంచి ఏకదాటిగా కురుస్తున్న వర్షానికి లోతట్టు ప్రాంతాలను వరద నీరు ముంచెత్తింది. ఇటీవల వేసిన వరి పంటను వర్షపు నీరు నీట ముంచింది. ప్రగళ్లపల్లిలో విద్యుత్ తీగలు భారీ వృక్షం పడటంతో జీపీ సిబ్బంది అష్టకష్టాలు ఓర్చి సరిచేశారు. గొల్లగూడెం వద్ద మిర్చి చేన్లలో ఉన్న రేకుల షెడ్డును వరద ముంచెత్తింది. మండల కేంద్రంలోని నాగారం సమీపంలో ఉన్న లోతట్టు ప్రాంతంలో ఉన్న ఇళ్లు, చర్చి నీట మునిగాయి. గుమ్మడిదొడ్డి ఎస్సీకాలనీ చుట్టూ వరద నీరు కమ్మేయడంతో బాధితులను అధికారులు పునరావాస కేంద్రాలకు తరలించారు. వాజేడు-గుమ్మడిదొడ్డి, పేరూరు-చంద్రుపట్ల, టేకులగూ డెం-ఛత్తీస్‌గఢ్, ఏడ్జర్లపల్లి-బొమ్మనపల్లి, కోయవీరాపురం గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. టేకులగుడెం వద్ద వరద ఉధృతిపై సమీప గ్రామాల ప్రజలను అప్రమత్తం చేసేందుకు అర్ధరాత్రి వరకు విధులు నిర్వహించారు. అరుణాచలపురం వద్ద ఉన్న గుండం జలపాతం వద్దకు వెళ్లకుండా జీపీ సిబ్బంది అడ్డుకట్ట వేశారు.

ఉప్పొంగిన వాగులు, వంకలు

కాటారం : మండలంలో ఏకదాటి కురిసిన వర్షంతో అంతా అతలాకుతలమైంది. శుక్రవారం రాత్రి, శనివారం ఎడతెరిపి లేకుండా కురిసిన భారీ వర్షంతో లోతట్టు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. 24గంటల వ్యవధిలో 12సెం.మీలకు పైగా వర్షాపాతం నమోదు కావడంతో జనజీవనం అస్తవ్యస్తమైంది. పలు చోట్ల పంట పొలాల్లోకి వరద నీరు చేరి రైతాంగానికి తీవ్ర నష్టం వాటిల్లింది. అతి భారీ వర్షంతో లోతట్టు ప్రాంతాలన్నీ వరద నీటితో జలమయమయ్యాయి. పొలాలు, పత్తి చేలన్నీ వరదనీటితో చెరువులను తలపిస్తున్నాయి. జాదరావుపేట శివారులోని బ్రిడ్జి సమీపంలో వరదనీటితో తారురోడ్డు కోతకు గురైంది. ఇప్పమాటు ఉప్పొంగి పదుల ఎకరాల్లో వరి పొలాలు నీటమునిగాయి. మానేరు నది నురగలు కక్కుతూ ప్రవహిస్తోంది. గంగారం అలుగువాగు, పోతులవాయి బొర్రవాగు, ఒడిపిలవంచ బండల వాగు, మల్లారం వాగులు భారీవర్షానికి పొంగిపొర్లడంతో రాకపోకలు నిలిచిపోయాయి.

గంటల పాటు వాహనాలు దాటని పరిస్థితి నెలకొంది. ప్రమాదకరంగా పొంగుతున్న వాగుల నుంచి ఎవరూ దాటకుండా పోలీస్, రెవెన్యూ సిబ్బంది రాత్రి, పగలు బందోబస్తు నిర్వహించారు. పెద్దవాగు ఉప్పొంగడంతో దామెరకుంట, మల్లారం, గంగపురి, గుండ్రాత్‌పల్లి పరిధిలో వందల ఎకరాల్లోని పత్తి చేలల్లోకి భారీగా వరద నీరు చేరడంతో మొక్కలు నీట మునిగాయి. గంగారంలో ములకల్ల రమేష్‌కు చెందిన ఇల్లు కుప్పకూలింది. గోసి కొండ రాజయ్య ఇంట్లోకి వరదనీరు చేరడంతో ఇబ్బందులు పడ్డారు.

రాకపోకలు బంద్

మహాముత్తారం: మండలంలో శుక్రవారం రాత్రి నుంచి కురుస్తున్న భారీ వర్షంతో వాగులు వంకలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. శనివారం ఉదయం నుంచే కాటారం-మేడారం రోడ్డులో కేశాపూర్ వద్ద లోలెవల్ కల్వర్టుపై నుంచి వరద నీరు ప్రవహిస్తోంది. మండల కేంద్రానికి వచ్చే దారిలో సబ్‌స్టేషన్ వద్ద కోనంపేట వాగు లోలెవల్ కల్వర్టులు నీటముగడంతో మండల కేంద్రానికి రాకపోకలు నిలిచిపోయాయి. కొద్ది రోజులుగా ఎడతెరిపి లేని వర్షంతో పత్తి చేన్లు నీట మునిగి రైతులు నష్టపోతున్నారు. శనివారం రాత్రి కూడా వర్షం ఇలాగే కొనసాగితే మండలంలోని అన్ని గ్రామాలకు మండల కేంద్రంతో సంబంధాలు తెగిపోతాయి. లోతట్టు గ్రామాలైన యత్నారం, కనుకునూర్ ప్రజలను అధికారులు ఇప్పటికే అప్రమత్తం చేశారు.

ఉధృతంగా జంపన్నవాగు

మేడారం: తాడ్వాయి మండలం మేడారం జంపన్నవాగు ఉధృతంగా ప్రవహించింది. వర్షం ఇలాగే కొనసాగితే వాగు ఉప్పొంగి పరిసరాలను ముంచెత్తుతాయని స్థానికులు భయందోళనలకు గురవుతున్నారు. ఈ క్రమంలో అధికారులు ప్రజలను హై అలర్ట్ చేశారు. కలెక్టర్ దివాకర ఆదేశాల మేరకు జిల్లా విపత్తు ప్రతిస్పందన దళం (డీడీఆర్ఎఫ్)ను మోహరించారు. జంపన్నవాగు పరీవాక ప్రాంతాల్లో పర్యటిస్తూ ఈ బృందం ప్రజలను అప్రమత్తం చేస్తోంది.

పొంగిపొర్లుతున్న వాగులు

మహదేవపూర్: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు మండలంలోని వాగులు వంకలు ఉప్పొంగుతున్నాయి. చంద్రుపల్లి నుంచి అన్నారం వెళ్లే వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో అన్నారం నుంచి కాళేశ్వరం రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. అన్నారం నుంచి కాళేశ్వరం వెళ్లే వాహనదారులు, ప్రయాణికులు ఇబ్బందులకు గురవుతున్నారు. చంద్రుపల్లి-అన్నారం వెళ్లే ప్రయాణికులు, వాహనదారులు అప్రమత్తంగా ఉండాలని మహదేవపూర్ పోలీసులు తెలిపారు.

కార్మికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలి

ములుగు కలెక్టర్ దివాకర



కార్మికులతో మాట్లాడుతున్న కలెక్టర్

ములుగు రూరల్ జూలై 27: ఇటుకబట్టీల్లో పని చేస్తున్న కార్మికులకు మెరుగైన సౌకర్యాలు కల్పిం చాలని అధికారులను కలెక్టర్ దివాకర ఆదేశించారు. ములుగు మండలం బండారుపల్లి గ్రామ శివారులోని ఇటుక బట్టీలను కార్మిక శాఖ జిల్లా సహాయ అధికారి వినోదతో కలిసి ఆయన శనివారం సందర్శించారు. ఇటుక బట్టీల్లో పనిచేస్తున్న ఒడిషా, ఛత్తీస్‌గఢ్ కార్మికులతో మాట్లాడుతూ వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఇటుక బట్టీల్లో పనిచేస్తున్న కార్మికులకు, వారి కుటుంబ సభ్యులకు పని ప్రదేశంలో మెరుగైన సౌకర్యాలు అందేలా కృషి చేయాలని అన్నారు. ఇందులో భాగంగా కార్మిక సంఘాల నాయకులతో సమావేశాన్ని ఏర్పాటు చేయాలని ఆయన సూచించారు.

జాతీయ స్థాయి అవార్డుకు చిన్నారి ఎంపిక



వినీషా

టేకుమట్ల, జూలై 27: మండలంలోని సుబ్బక్కపల్లి గ్రామానికి చెందిన చిన్నారి ఉరుగొండ వినీషా జాతీయస్థాయి గౌతమినంది అవార్డుకు ఎంపికైంది. శ్రీ గౌతమేశ్వర గోసంరక్షణ సమితి, విశ్వవిఖ్యాత ఆర్ట్స్ అండ్ కల్చరల్ అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని త్యాగరాయ గానసభలో ఆదివారం జరిగే కార్యమంలో మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు చేతుల మీదుగా పురస్కారాన్ని అందుకోనుంది. సుబ్బక్కపల్లి గ్రామానికి చెందిన ఉరుగొండ వెంకటేశ్, శిరిష దంపతుల కూతురు వినీషా భరత నాట్యంలో ప్రావీణ్యాన్ని పొందింది. వివిధ ప్రదర్శనల్లో తన కళా నైపుణ్యాన్ని చాటుతోంది.

చెరువు మరమ్మతులు చేపట్టాలి : బీజేపీ

వెంకటాపూర్(రామప్ప), జూలై 27: మండలంలోని బూర్గుపేట మారేడుగొండ చెరువు కట్ట తెగిపోయి ఏడాది పూర్తయినా ప్రభుత్వం శాశ్వత మరమ్మతులు చేపట్టకపోవడం సరికాదని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు భూక్య జవహర్‌లాల్ విమర్శించారు. శాశ్వత మరమ్మతులు చేపట్టి రైతుల కష్టాలు తీర్చాని అన్నారు. శనివారం ఆయన నాయకులతో కలిసి చెరువు కట్ట తెగిపోయిన ప్రాంతాన్ని సందర్శించారు. మారేడుగొండ చెరువు కట్ట తెగిపోవడంతో ఆయకట్టు రైతులు ఆవేదన చెందుతున్నారన్నారు. మరమ్మతు పనులు చేయించడంలో మంత్రి సీతక్క పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఇప్పటికైనా ప్రభుత్వం మరమ్మతులు చేపట్టి రవాణా సౌకర్యాన్ని మెరుగుపరచడంతోపాటు రైతుల కష్టాలను తీర్చాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో నాయకులు కారుపోతుల యాదగిరిగౌడ్, ధరమ్‌సింగ్, తిరుపతిరెడ్డి, శ్రీధర్, సోనాసింగ్, భారతి, విక్రాంత్, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికితీయాలి

భూపాలపల్లిటౌన్, జూలై 27: విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీసేలా ఉపాధ్యాయులు బోధనాభ్యాసాలను పాటించాలని ఏఎంవో కాగిత లక్ష్మణ్ అన్నారు. జిల్లాలోని ఎంపికైన ప్రాథమిక పాఠశాలల రిసోర్స్ పర్సన్లకు శనివారం శిక్షణ తరగతులు జరిగాయి. ఈ సందర్భంగా లక్ష్మణ్ మాట్లాడుతూ జాతీయ సాధన పరీక్ష కోసం తెలుగు, ఆంగ్లం, గణితం, పరిసరాల విజ్ఞానం తదితర అంశాల్లో విద్యార్థులను మరింత మెరుగుపరిచేలా బోధన ఉండాలని సూచించారు. గణితంలో మెలకువలను నేర్పాలన్నారు. అనంతరం కాంప్లెక్స్ హెచ్‌ఎం లక్ష్మీప్రసన్న మాట్లాడుతూ విద్యార్థుల్లో సామర్థ్యం అంతర్గతంగా ఉంటుందని, దానిని వెలికితీసేందుకు ప్రయత్నించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్లు స్వామి, మధుసూదన్, రతన్‌సింగ్, రామయ్య, కిషన్‌రెడ్డి, తిరుపతి, రఘునందన్, శ్రీకాంత్, జిల్లా పరీక్షల సహాయకులు కుసుమ కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ములుగు కలెక్టరేట్, జూలై 27: ములుగులోని 132/33 కేవీ విద్యుత్ ఉపకేంద్రం పరిధిలో ఈనెల 28న విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ట్రాన్స్‌కో డీఈ నాగేశ్వర్‌రావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 132/33కేవీ విద్యుత్ ఉపకేంద్రంలో మరమ్మతులు ఉండడం వల్ల ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు ములుగు, పత్తిపల్లి, కాసిందేవిపేట, మల్లంపల్లి, అబ్బాపురం, రామచంద్రాపురం, పందికుంట, వెంకటాపూర్, లక్ష్మీదేవిపేట, నర్సాపూర్, వెల్తుర్లపల్లి గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు వివరించారు.

బాధ్యతలు స్వీకరించిన చిట్యాల తహసీల్దార్

చిట్యాల, జూలై 27: చిట్యాల తహసీల్దార్‌గా హేమ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ విధులు నిర్వర్తించిన ఖాజా మోహియుద్దీన్ కలెక్టరేట్‌కు బదిలీ అయ్యారు. పలిమెల మండలంలో విధులు నిర్వర్తించిన హేమను ఇక్కడికి బదిలీపై వచ్చారు.

సీపీఆర్ విధానంతో ప్రాణాలను కాపాడొచ్చు

అవగాహన కార్యక్రమంలో ప్రొఫెసర్ చంద్రశేఖర్

ములుగు, జూలై 27: సీపీఆర్ విధానంతో మనిషి ప్రాణాలను 50శాతం కాపాడొచ్చని ములుగు మెడికల్ కళాశాల ప్రొఫెసర్ డాక్టర్ చంద్రశేఖర్ అన్నారు. శనివారం ములుగులోని డీఎంహెచ్‌వో సమావేశపుహాల్‌లో సీపీఆర్ విధానంపై సిబ్బందికి అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్పృహ కోల్పోయిన వ్యక్తికి రెండు నుంచి ఏడు నిమిషాల వ్యవధిలో సీపీఆర్ చేసినట్లయితే తప్పకుండా బతుకుతాడని అన్నారు. డీఎంహెచ్‌వో అల్లెం అప్పయ్య మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా నిమిషానికి 12లక్షల మంది రక్తం ఆగిపోయి చనిపోతున్నారని, సీపీఆర్ పద్ధతి ద్వారా ఆరులక్షల మంది ప్రాణాలను కాపాడవచ్చని అన్నారు. ఈవిషయమై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్యశాఖ ప్రోగ్రాం ఆఫీసర్లు పవన్, శ్రీకాంత్, రవీందర్, ప్రొఫెసర్ భిక్షపతిరావు, తదితరులు పాల్గొన్నారు.

మోడల్ స్కూల్ ఉపాధ్యాయుల నిరసన



నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

మహాముత్తారం, జూలై 27: బదిలీలు చేయా లంటూ మండలంలోని తెలంగాణ మోడల్ స్కూల్ ఉపాధ్యాయులు శనివారం భోజన విరామ సమయంలో నిరసనకు దిగారు. 11 ఏళ్లుగా ఒకేచోట విధులు నిర్వరిస్తూ కుటుంబాలకు దూరంగా ఉంటూ మనసిక క్షోభకు గురవుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వానికి ఎన్నిసార్లు మొరపె ట్టుకున్నా పట్టించుకోవడం లేదని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రాజు, ఉపాధ్యాయులు రాము, విజయ, జ్యోతి, పావని, స్వాతి, ప్రియ, శ్రీధర్ పాల్గొన్నారు.

గోదావరి తగ్గుముఖం

మహదేవపూర్, జూలై 27: మండలంలోని కాళేశ్వరంలోని త్రివేణి సంగమం వద్ద శనివారం గోదావరి తగ్గుముఖం పట్టింది. 13 రోజులుగా గోదావరి ప్రాణహిత వరద మెట్ల వరకు ప్రవహించడంతో రైతులు, గ్రామస్థులు, భక్తులు ఆందోళనకు గురయ్యారు. శనివారం నుంచి గోదావరి పూర్తిగా తగ్గుముఖం పట్టడంతో ఊపిరి పీల్చుకున్నారు. ఎగువన కురుస్తున్న భారీ వర్షాలతో గోదావరి, ప్రాణహిత నదులు ఉప్పొంగి ప్రవహించడంతో ఇన్నిరోజులు గోదావరికి వరద పోటెత్తింది.

- ఏటూరునాగారం రూరల్: ఉగ్రరూపం దాల్చిన గోదావరి క్రమంగా తగ్గుముఖం పడుతోంది. మూడో ప్రమాద హెచ్చరికకు చేరువగా ప్రవహించిన నది శని వారం తెల్లవారుజామునా నుంచి స్వల్పంగా తగ్గుతూ వచ్చింది. రామన్నగూడెం పుష్కరఘాట్ వద్ద శనివారం తెల్లవారు జామునా 16.130 మీటర్ల నీటిమట్టానికి చేరువైన గోదావరి ఆ తర్వాత కొన్ని గంటల పాటు నిలకడగా ఉండి తగ్గుతూ వచ్చింది. ఉదయం 7 గంటలకు పుష్కరఘాట్ వద్ద గోదావరి నీటిమట్టం 16.120 మీటర్లు ఉండగా మధ్యాహ్నం 2 గంటలకు 15.850 చేరి తగ్గుతూ వచ్చింది. సాయంత్రం 5 గంటలకు 15.770 మీటర్లకు గోదావరి నీటిమట్టం చేరి క్రమేపీ తగ్గుముఖం పడుతోంది. ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలకు గోదావరి మరింతగా వరద వచ్చే అవకాశమున్నట్లు జలవనరుల శాఖ తెలిపింది. దీంతో అధికారులు అప్రమత్తంగా వ్యవహరిస్తున్నారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, గోదావరికి వరద పెరిగితే పునరావాస కేంద్రాలకు వెళ్లేందుకు సిద్ధంగా ఉండాలని హెచ్చరికలు జారీ చేశారు.
- వాజేడు : మండలంలో శనివారం గోదావరి తగ్గుముఖం పట్టింది. ఎగువున ఉన్న బ్యారేజీ నుంచి నీటి విడుదలను తగ్గించడంతో మండలంలో గోదావరి ఉధృతి తగ్గింది. శనివారం ఉదయం 4గంటలకు 17.67 మీటర్లు ఉన్న నీటి మట్టం కొంచెం కొంచెం తగ్గుతూ 8గంటలకు 17.49 మీటర్లు, 10గంటలకు 17.33 మీటర్లు, మధ్యాహ్నం 12గంటలకు 17.17 మీటర్లు, 1గంటకు 17.10 మీటర్లు, 3గంటలకు 16.97 మీటర్లు, 5గంటలకు 16.91 మీటర్లు, సాయంత్రం 6గంటలకు 16.80 మీటర్ల నీటిమట్టానికి చేరుకుంది.

మహిళా అభ్యున్నతికి ప్రభుత్వం పెద్దపీట

అడిషనల్ కలెక్టర్ వెంకటేశ్వర్లు



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్

భూపాలపల్లిటౌన్, జూలై 27: మహి ళా అభ్యున్నతికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని అడిషనల్ కలెక్టర్ కె.వెంకటేశ్వర్లు అన్నారు.రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టా త్మకంగా నిర్వహిస్తున్న ఇందిరా మహిళా శక్తి కార్యక్రమంపై భూపాలపల్లి మునిసిపల్ కార్యాలయంలో శని వారం అవగాహన సమావేశం జరి గింది. మునిసిపల్ కమిషనర్ రాజేశ్వర్ అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథిగా అడిషనల్ కలెక్టర్ హాజరయ్యారు. మహి ళల స్వావలంబనపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని అన్నారు. ఈ క్రమం లోనే స్వయం ఉపాధి రంగంలో అనేక అవకాశాలు కల్పిస్తోందన్నారు. మహిళలు వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వివిధ రకాల వృత్తి నైపు ణ్యాలను నేర్చుకుని, ప్రభుత్వం ద్వారా జీవనోపాధి వృద్ధి చెందేలా కృషి చేయా లని అన్నారు. అర్బన్ మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్ రాజేశ్వరి మాట్లాడుతూ ఇప్పటి వరకు ప్రభుత్వం అందించే స్వయంగా ఉపాధి పథకం కింద దరఖాస్తులు ఆహ్వా నించగా పట్టణ మహిళా సంఘాల నుంచి మీ-సేవ కోసం 2, క్యాంటీన్ల కోసం 7, నాటుకోళ్ల పెంపకం కోసం 1 వచ్చాయని తెలిపారు. మీ-సేవకు దరఖాస్తు చేసిన వారు డిగ్రీ ఉత్తీర్ణులై, కంప్యూటర్ స్కిల్స్ కలిగి ఉండాలన్నారు. ఈ సమావేశంలో అర్బన్ మహిళా సమాఖ్య అధ్యక్షులు, రిసోర్స్‌పర్సన్లు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

ఏటూరునాగారం రూరల్, జూలై 27: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశముందని, ప్రజలు రోగాల బారిన పడకుండా అప్రమత్తంగా ఉంటూ తగిన జాగ్రత్తలు పాటించాలని డిప్యూటీ డీఎంహెచ్‌ఎంవో డాక్టర్ కోరం క్రాంతికుమార్ తెలిపారు. మండలంలోని చింతల మోరీ గొత్తికోయగూడెం ఇంటింటా ఫీవర్ సర్వే శనివారం నిర్వహించి వైద్య శిబిరం చేపట్టారు. ఈ సందర్భంగా జ్వరం బారిన పడ్డ గొత్తికోయవాసుల రక్తనమూనాలను సేకరించి వారికి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. వర్షాలు కురుస్తున్న దృష్ట్యా ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని, రోగాల బారిన పడిన వెంటనే దగ్గరలోని ఆస్పత్రి వెళ్లాలని ఆయన సూచించారు. కాచి చల్లార్చిన తర్వాతే నీటిని తాగాలని సూచించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు అభినవ్, డాక్టర్ అన్మిషా, సబ్‌యూనిట్ ఆఫీసర్ నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.

సీమ్ ప్రైవేటీకరణను ఉపసంహరించుకోవాలి: ఏఐటీయూసీ

గణపురం, జూలై 27: సింగరేణి ఏరియా పరిధిలోని 8 ఇన్‌క్లైన్ రెండో సీమ్ ప్రైవేటీకరణను సింగరేణి యాజమాన్యం ఉపసంహరించుకోవాలని ఏఐటీయూసీ నాయకులు డిమాండ్ చేశారు. గణపురం మండలం బస్వరాజుపల్లిలోని కేటీకే 8 ఇన్‌క్లైన్ గని వద్ద అసిస్టెంట్ బ్రాంచి సెక్రటరీ మధుగాని విజేందర్ ఆధ్వర్యంలో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా భూపాలపల్లి ఏరియా బ్రాంచి కార్యదర్శి మోటపలుకుల రమేష్ మాట్లాడుతూ రెండో సీమ్‌ను ప్రైవేటు సంస్థకు ఇచ్చేందుకు సింగరేణి సిద్ధంగా ఉందని విమర్శించారు. దీంతో కార్మికులు తీవ్రంగా నష్టపోతారని అన్నారు. అనంతరం గని మేనేజర్ భానుప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు సుధాకర్‌రెడ్డి, శ్రీనివాస్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం

రేగొండ, జూలై 27: మండల కేంద్రంలో అనారోగ్యంతో ఇటీవల మృతి చెందిన కొలెపాక సంపత్ కుటుంబానికి అతడి మిత్రులు ఆర్థిక సాయం చేశారు. మృతుడి భార్యా ఇద్దరు పిల్లలను పరామర్శించి రూ. 20 వేలు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిట్ట రామకృష్ణారెడ్డి, ఎడ్ల శ్రీనివాస్, కట్ల తిరుపతి, జిట్ట వెంకన్న, అవినాష్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో ఇంటింటి ఫీవర్ సర్వే

వెంకటాపురం(నూగూరు), జూలై 27: మండలంలోని రాచపల్లి, మొర్రవానిగూడెం, చర్ల్లపేట గ్రామాల్లో వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో శనివారం ఇంటింటి ఫీవర్ సర్వే జరిగింది. ఈసందర్భంగా వైద్య సిబ్బంది ఆయా గ్రామాల్లో ఇంటింటికీ తిరుగుతూ జ్వరపీడితుల వివరాలు నమోదు చేసుకున్నారు.

అనారోగ్యంతో పంప్ ఆపరేటర్ మృతి



మహేష్ (ఫైల్)

మహదేవపూర్, జూలై 27 : మండలంలోని కాళేశ్వరం గ్రామానికి చెందిన బండి మహేష్(4)) అనే ప్రభుత్వ ఉద్యోగి (పంప్ ఆపరేటర్) శనివారం చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడి బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. మహేష్ వారం రోజుల క్రితం అనారోగ్యానికి గురయ్యాడు. వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రిలో చేరాడు. పరిస్థితి విషమించడంతో కుటుంబసభ్యులు హనుమకొండలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతిచెందాడు. 24 ఏళ్లుగా మహేష్ రెవెన్యూ డిపార్ట్‌మెంట్‌లో వీఆర్‌ఏగా పనిచేశాడు. బీఆర్ఎస్ ప్రభుత్వం వీఆర్‌ఏలను ఇతర శాఖల్లో సర్దుబాటు చేయడంతో ఇరిగేషన్ డిపార్ట్‌మెంట్‌లో పంప్ ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు.

ఏజెన్సీలో హై అలర్ట్

నేటి నుంచి మావోయిస్టుల సంస్మరణ వారోత్సవాలు

ఏటూరునాగారం, జూలై 27: మావోయిస్టు పార్టీ అమర వీరుల సంస్మరణ వారోత్సవాల నేపథ్యంలో నక్సల్స్ ప్రభావిత ప్రాంతమైన ఏటూరునాగారం ఏజెన్సీ వేడేక్కుతోంది. జూలై 28 నుంచి ఆగస్టు 3 వరకు వారోత్సవాలు నిర్వహించేందుకు మావోయిస్టు పార్టీ అగ్ర నేతలు పిలుపునిచ్చారు. ఈ నేపథ్యంలో పోలీసులు అప్రమత్తమయ్యారు. అడుగడు గునా నిఘా పెంచారు. ప్రజాప్రతినిధులను స్థానికంగా ఉండొద్దని, సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని సూచిస్తున్నారు. పలు మండలాల పరిధిలో మావోయిస్టులకు సహకరిస్తున్న మిలీషియా సభ్యులు, సానుభూతి పరులను విచారిస్తు న్నారు. అడవుల్లో ముమ్మరంగా కూంబింగ్ నిర్వహిస్తు న్నారు. రహదారుల వెంట విస్తృతంగా వాహనాలను తనిఖీ చేస్తున్నారు. అనుమానితులను వివరాలను అడుగుతు న్నారు. గతంలో ఆయా విప్లవ గ్రూపుల్లో పని చేసిన వారిని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. అనుమానితులు కనిపిస్తే సమాచారం ఇవ్వాలని ఆయా గ్రామాల్లో ప్రజలకు కౌన్సెలింగ్ ఇస్తున్నారు. తమ ఇన్‌ఫార్మర్ వ్యవస్థను పటిష్టం చేసి వివరాలు సేకరిస్తున్నారు.

ఏటూరునాగారం, మంగపేట, కన్నాయిగూడెం, వాజేడు, వెంకటాపురం(నూగూరు), తాడ్వాయి మండలాల పరిధిలోని అటవీ ప్రాంతంలో పోలీసులు నిఘా పెంచారు. ఛత్తీస్‌గఢ్ సరిహద్దులో మావోయిస్టుల కార్యకలాపాలు ఊహించని విధంగా కొనసాగుతున్న నేపథ్యంలో పోలీసులు సైతం తమ పంథాను మార్చుకొని ముందుకెళ్తున్నారు. మావోయిస్టుల కార్యకలాపాలు అధికమైన నేపథ్యంలో పోలీసు శాఖ ఉన్నతాధికారులు ఏజెన్సీలోని స్టేషన్ల సిబ్బందిని అలర్ట్ చేశారు. ఏజెన్సీ మండలాలకు చెందిన ప్రజా ప్రతినిధులు, టార్గెట్లను అప్రమత్తం చేశారు. స్థానికంగా ఉండొద్దని, సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని ఆదేశాలు జారీ చేశరు. గోదావరి తీర ప్రాంతాలు, అడవుల్లోని గొత్తికోయ గూడేల్లో పోలీసులు జల్లెడ పడుతున్నారు.

తలలపై రివార్డులు

మావోయిస్టు ముఖ్య నేతల తలలపై పోలీసులు రివార్డులు ప్రకటించారు. ఏజెన్సీ గ్రామీణ అటవీ ప్రాంతంలోని ప్రజలు అజ్ఞాత మావోయిస్టులకు ఎవరు కూడా సహకరించవద్దంటూ మావోయిస్టుల వివరాలతో పోస్టర్లు, కరపత్రాలు విడుదల చేశారు. మావోయిస్టు నేతలు కంకణాల రాజిరెడ్డి అలియాస్ వెంకటేశ్, కుర్సం మంగు అలియాస్ భద్రు, ఎగొల్లపు మల్లయ్య అలియాస్ కోటి, ముచాకి ఉంగాల్ అలియాస్ సుధాకర్, కుంజం ఇడమాల్ అలియాస్ మహేందర్, ముసాకి జమున, ముసాకి దేవాల్ అలియాస్ కురుణాకర్, నల్లమూరి అశోక్ అలియాస్ విజయేందర్, మడకం ఇడుమయ్య అలియాస్ మహేష్, కారం బుద్రి అలియాస్ రీతా ఫొటోలతో పోస్టర్లు అంటించారు. వారి తలలపై రూ. 20 లక్ష నుంచి రూ. 1 లక్షల వరకు రివార్డులు ప్రకటించారు.

మావోయిస్టుల కదలికలపై నిఘా

ములుగు ఎస్పీ శబరీశ్



టేకులగుడెం వద్ద ఎస్సైతో మాట్లాడుతున్న ఎస్పీ శబరీశ్

వాజేడు, జూలై 27: ఏజెన్సీలో మావోయిస్టుల కదలికలపై పటిష్ఠ నిఘా ఏర్పాటు చేశామని ములుగు ఎస్పీ శబరీశ్ అన్నారు. మండలంలోని పేరూరు, కృష్ణాపురం, టేకులగూడెంలోని వరద ముంపు ప్రాంతాలను ఆయన శనివారం పరిశీలించారు. వరదలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వాగులు, చెరువుల వైపు ఎవరూ వెళ్లకూడదన్నారు. వరద బాధితులు స్థానిక అధికారుల సూచన మేరకు పునరావాస కేంద్రాలకు వెళ్లాలని సూచించారు. ఆదివారం నుంచి మావోయిస్టుల వారోత్సవాలు ఉన్న నేపథ్యంలో రాజకీయ నాయకులు, ప్రజాప్రతినిధుల, దళారులు, అధికార పార్టీ ప్రతినిధులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మావోయిస్టులకు ఎవరూ సహకరించొద్దని గ్రామస్థులను కోరారు. మావోయిస్టుల కదలికలపై సమాచారం ఉంటే తమకు తెలియజే యాలన్నారు. ఆయన వెంట ఏటూరునాగారం ఏఎస్పీ శివంఉపాధ్యాయ, పేరూరు ఎస్సై గుర్రం కృష్ణప్రసాద్ తదితరులు ఉన్నారు.

సీఎంఆర్ వికేంద్రీకృత గోడౌన్‌ను ప్రారంభించిన కలెక్టర్

గోవిందరావుపేట, జూలై 27: మండల కేంద్రంలోని ఆధునిక వ్యవసాయ గోదాం మార్కెట్‌యార్డులో నూతనంగా ఏర్పాటుచేసిన సీఎంఆర్ వికేంద్రీకృత గోడౌన్‌ను కలెక్టర్ దివాకర శనివారం ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ 2023-24 ఖరీఫ్ కింద సీఎంఆర్ బియ్యం రైస్‌మిల్లర్ల ద్వారా పంపిణీ చేయబడినవి వికేంద్రీకృత గోదాం నుంచి అనుమతించేందుకు ప్రారంభించినట్లు పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో అదనపు కలెక్టర్ మహేందర్‌జీ, డీసీఎస్‌వో రాంపతి, రైస్‌మిల్లర్లు పాల్గొన్నారు.

కన్నాయిగూడెం మండలంలో పర్యటన

కన్నాయిగూడెం: మండలంలోని కంతనపల్లి వద్ద ఉన్న లోలెవల్ కల్వర్టును కలెక్టర్ దివాకర శనివారం పరిశీలించారు. ఏటూరనాగారం-తుపాకులగూడెం ప్రధాన రహదారిలో ఉన్న ఈ కల్వర్టు వరద ప్రవాహాన్ని పరిశీలించి అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. వరద ప్రవాహం ఎక్కువగా ఉన్నప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి పలు సూచనలు చేశారు. ఆయన వెంట మండల స్పెషల్ ఆఫీసర్ వెంకట నారాయణ, ఇరిగేషన్ డీఈ శరత్ బాబు, పంచాయతీ కార్యదర్శి నారాయణ ఉన్నారు.

కూతురిని చూసేందుకు గుట్టలు దిగొచ్చిన తల్లిదండ్రులు

వాజేడు, జూలై 27: జ్వరం వచ్చిన కూతురిని చూసేందుకు ఆ తల్లిదండ్రులు సాహసమే చేశారు. మండల కేంద్రానికి 17 కిలోమీటర్ల దూరంలో పెనుగోలు గుట్టలపై నివాసం ఉంటున్న బొగ్గుల లక్ష్మీ, సత్యం దంపతులు తమ కుమార్తెకు జ్వరం వచ్చిందని తెలుసుకుని హుటాహుటిన గుట్టలు, ఉప్పొంగి ప్రవహిస్తున్న వాగులు దాటుకుంటూ కిందకు దిగొచ్చారు. వీరి కూతురు బొగ్గుల మల్లీశ్వరి మండలంలోని శ్రీరాంనగర్ బాలికల ఆశ్రమ పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతోంది. ఆమెకు జ్వరం వచ్చిందని తెలుసుకున్న తల్లిదండ్రులు అల్లాడిపోయి ఆమెను చూసేందుకు తరలివచ్చారు. వారి వెంట ఆ బాలిక తాత రామయ్య కూడా మనవరాలిని చూసేందుకు వచ్చారు.

అసైన్డ్ భూములకు హక్కులు కల్పించాలని నిరసన

ములుగు కలెక్టరేట్, జూలై 27: అసైన్డ్ భూములపై సంపూర్ణ యాజమాన్య హక్కులు కల్పిస్తూ అసైన్డ్ భూముల చట్టం-1977 రద్దు బిల్లును తెలంగాణ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో ప్రవేశపెట్టి ఆమోదించాలని, ఇందుకు రాష్ట్ర మంత్రి ధనసరి సీతక్క చొరవ చూపాలని డిమాండ్ చేస్తూ అసైన్డ్‌భూమి సమితి(ఏబీఎస్), ప్రజాసంఘాల ఆధ్వర్యంలో నాయకులు ములుగులోని అంబేద్కర్ విగ్రహం ఎదుట శనివారం నిరసన తెలిపారు. ఈసందర్భంగా జరిగిన సమావేశంలో న్యాయవాది, ఏబీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు కలకోటి మహేందర్ మాట్లాడుతూ ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీ వరంగల్ రైతు డిక్లరేషన్ సభలో సీఎం రేవంత్‌రెడ్డి అసైన్డ్ భూములకు పూర్తి హక్కులు కల్పించి వాటిని పట్టా భూములుగా మారుస్తామని హామీ ఇచ్చారని, దానిని నిలబెటుకోవాలని అన్నారు. ప్రజాసంఘాల జేఏసీ చైర్మన్ ముంజాల భిక్షపతిగౌడ్ మాట్లాడుతూ అసైన్డ్ భూముల చట్టాన్ని రద్దు చేసి అసైన్డ్ భూముల అమ్మకం, కొనుగోలు, గిఫ్ట్, మార్టిగేజ్, లీజు రిజిస్ట్రేషన్ కార్యాలయాల ద్వారా జరగాలని, ఇందుకోసం రైతులు ఉద్యమించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏబీఎస్, ప్రజాసంఘాల నాయకులు గోల్కొండ బుచ్చన్న, ల్యాదెల్ల అశోక్, కుర్రి దినాకర్, కోరె రవియాదవ్, మాదాసి సురేష్, బాల్యా రవి, ఓరుగంటి ప్రశాంత్, పారునందుల శ్రీనివాస్, మారేపల్లి సాంబయ్య, తదితరులు పాల్గొన్నారు.

బొగ్గు ఉత్పత్తికి ఇంకా ఆటంకమే..

కాకతీయఖని, జూలై 27: సింగరేణి భూపాలపల్లి ఏరియాలో కురుస్తున్న వర్షం ప్రభావంతో ఓపెన్ కాస్ట్ ప్రాజెక్ట్- 2,3లలో బొగ్గు ఉత్పత్తికి ఏర్పడిన ఆటంకం కొనసాగుతోంది. క్వారీల్లో వర్షపు నీరు నిలవడంతో కోల్ ఆపరేషన్, ఓవర్ బర్డెన్(ఓబీ) పనులు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. రహదారులు బురదమయం కావడంతో యంత్రాలు కదలలేని పరిస్థితి ఉన్నాయి. ఈ క్రమంలో ఉపరితల గని నుంచి బొగ్గును వెలికి తీయడం కష్టతరమైంది. ఓపెన్ కాస్ట్ ప్రాజెక్ట్-2లో రోజుకు 2,308 టన్నుల బొగ్గును వెలికి తీయాల్సి ఉంది, ఓసీ-3లో 4077 టనున్నల బొగ్గు ఉత్పత్తిని సాధించాల్సి ఉంది. అయితే.. శనివారం టన్ను బొగ్గును కూడా వెలికి తీయలేదని ఏరియా సింగరేణి అధికారులు చెబుతున్నారు. దీంతో ఓసీ-2,3ల ద్వార సింగరేణి సంస్థకు సుమారు రూ. 2 కోట్లు నష్టం వాటిల్లిందని తెలిపారు.

మానవత్వం చాటుకున్న పడవ యజమాని



పడవలో బాలుడు, తల్లిదండ్రులు

వాజేడు, జూలై 27: ఎడతెరిపి లేని వర్షాలు ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నాయి. ఉప్పొంగి ప్రవహిస్తున్న వాగులకు రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. అత్యవసర పరిస్థితుల్లో బయటకు రాలేని పరిస్థితి నెలకొంది. ఈ క్రమంలో ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం తాళ్లగూడెం గ్రామానికి చెందిన ఏడాది బాలుడికి శనివారం ఫిట్స్ వచ్చాయి. దీంతో తల్లిదండ్రులు దిక్కుతోచని స్థితిలో పడ్డారు. ఓ వాహనంలో 163వ జాతీయ రహదారి టేకులగూడెం సరిహద్దుకు రాగా మధ్యలో రేగుమాగు గండి ఉండటంతో రాకపోకలు నిలిచిపోయాయి. విషయం తెలుసుకున్న పడవ యజమాని మానవత్వం చాటుకున్నాడు. తక్షణమే తనకున్న పడవతో అవతలి వైపు వెళ్లి విషమంగా ఉన్న బాలుడిని, అతడి తల్లిదండ్రులను ఇవతలకు దాటించాడు. ఒడ్డుకు చేరుకున్న తల్లిదండ్రులు మెరుగైన వైద్యం నిమిత్తం బాలుడిని వరంగల్‌కు తరలించారు.

పదిరోజులుగా టేకులగూడెం వద్ద అంతర్రాష్ట్ర రాకపోకలు నిలిచిపోవడంతో వాహనాలు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. ఈ క్రమంలో పోలీసులు వాగులు దాటేందుకు పడవలు తిప్పొద్దని హెచ్చరికలు జారీ చేశారు.

ఫెర్టిలైజర్స్, సీడ్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా శేఖర్



కాటారం, జూలై 27: మండల ఫెర్టిలైజర్స్, సీడ్స్ అసోసియేషన్ కార్యవర్గం ఎన్నిక జరిగింది. అధ్యక్షుడిగా కవ్వాల శేఖర్, గౌరవ అధ్యక్షుడిగా బొమ్మ సమ్మిరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా జక్కుల అజయ్ కుమార్, ఉపాధ్యక్షులుగా అల్లాడి చంద్రమౌళి, కొత్త రాజేందర్, కోశాధికారిగా బచ్చు ప్రభాకర్, కార్యదర్శులుగా దోమ భాస్కర్, తోట కోటేశ్వర్, ప్రచార కార్యదర్శిగా నిడిగొండ చెన్నకేశవ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నందుకు అధ్యక్షుడితో పాటు ప్రతినిధులు కృతజ్ఞతలు తెలిపారు.